సాక్షి జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం | 22 | ఆగస్టు | 2023



మరమ్మతుకు నోచని చెరువులు

మల్హర్ మండలంలోని చెరువులు మరమ్మతుకు నోచుకోకపోవడం చెరువులో నీరు నిలవకుండా పోతుంది. - 9లో▸



'ఉపాధి' పనులు పారదర్శకంగా నిర్వహించాలి - 9లో▸

ఉపాధిహామీ పథకం దుర్వినియోగం కాకుండా పనులు పారదర్శకంగా నిర్వహించాలని అడిషనల్ డీఆర్‌డీఓ అవినాష్ తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.6^{0} / 22.7^{0}

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్సీ ఎస్‌ఎంహెచ్ మంజూరు చేయాలి



ములుగు రూరల్: ఎస్సీ ఎస్‌ఎంహెచ్ హాస్టల్‌ను మంజూరు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయాన్ని వారు ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు జీపుజాతా కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ రమేష్, రవితేజ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బోటు ఏర్పాటు



ఏటూరునాగారం: మండల పరిధిలోని కొండాయి గ్రామానికి ప్రజలు రవాణా సాగించేందుకు జంపన్నవాగు వద్ద మర బోటును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పది రోజులుగా బోటు లేకపోవడంతో ప్రజలు వాగు దాటుతూ వస్తున్నారు. బోటు ఏర్పాటు గురించి ప్రజలు ప్రభుత్వానికి విన్నవించగా స్థానిక తహసీల్దార్ సంధ్యారాణి బోటును సోమవారం ఏర్పాటు చేయించారు. దీంతో ప్రజలు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్, వీఆర్‌ఏ శంకర్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్ర నాయకులను కలిసిన 'భగీరథ' సిబ్బంది



ఏటూరునాగారం: మిషన్ భగీరథ రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్‌ను సోమవారం హైదరాబాద్‌లో ములుగు జిల్లా టీఆర్‌ఎస్‌కేవీ యూనియన్ నాయకులు కలిసి సమస్యలను వివరించారు. తమకు ఐడీ కార్డులు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించి రూ. 24వేలు వేతనం ఇవ్వాలని నాయకులు లంక వెంకటేశ్, పవన్‌కుమార్, శివకుమార్ కోరారు. ప్రతీ కార్మికుడికి పీఎఫ్, ఈఎస్‌ఐ వర్తింపజేయాలని కోరారు. ప్రమాద బీమా రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వుతో నిరసన




ములుగు: ఐదు రోజులుగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమ్మె చేస్తున్నా ప్రభుత్వం సరైన హామీ ఇవ్వకపోవడంతో రెండో ఏఎన్‌ఎంలు సోమవారం కలెక్టరేట్ పక్కన ఉన్న పోస్టాఫీస్ సమీపంలో చెవిలో పువ్వుతో వినూత్నంగా నిరసన చేపట్టారు. ఎన్‌హెచ్‌ఎం నిధుల ద్వారా విధులు నిర్వహిస్తున్న వైద్యులను రెగ్యులర్ చేసిన ప్రభుత్వానికి తమ బాధలు కనిపించడం లేదా అంటూ వాపోయారు. పైగా రాత పరీక్షల ద్వారానే విధుల్లోకి తీసుకుంటామని చెప్పడం బాధాకరమన్నారు. 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎన్‌ఎంలకు పరీక్షలతో అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. రెగ్యులర్ శిక్షణ పొంది ప్రస్తుత అభ్యర్థులతో పోలిస్తే తక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉండదని వాపోయారు. ఇన్ని సంవత్సరాలు ప్రభుత్వం తరఫున అన్ని రకాల వైద్య సేవలు అందించిన తమను ప్రభుత్వం ఆంక్షలు లేకుండా రెగ్యులర్ చేయాలని కోరారు. పోరాటాలతోనే హక్కుల సాధన జరుగుతుందని చెప్పిన సీఎం కేసీఆర్ రెండో ఏఎన్‌ఎంలు సమ్మె చేస్తుంటే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మంజుల, కౌసల్య, నాగరాణి, తిరుపతమ్మ, సమ్మమ్మ, రమ, నరసమ్మ, సులోచన కల్పన, సుజాత, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ బరిలో పాత కాపులే..

తొమ్మిది మంది 'సిట్టింగ్'లకు మళ్లీ చాన్స్

- 'స్టేషన్' అడ్డాపై కడియం శ్రీహరి.. తాటికొండ రాజయ్యకు రిక్తహస్తం
- తెగని జనగామ జగడం.. 25 వరకు వాయిదా..
- ములుగులో కొత్త ముఖం, జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతికి అవకాశం
- ప్రస్తావనకు రాని మంత్రి సత్యవతి, ఎంపీలు కవిత, రవిచంద్ర, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, సారయ్య పేర్లు



సాక్షిప్రతినిధి, వరంగల్ :

బీఆర్‌ఎస్‌లో టికెట్ల ఉత్కంఠకు తెరపడింది. గులాబీ దళపతి, సీఎం కేసీఆర్ అభ్యర్థులను ఖరారు చేయడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఊహాగానాలకు తెరదించేలా ముఖ్యమంత్రి మరోసారి 'సిట్టింగ్'లకే పెద్దపీట వేశారు. ఉమ్మడి వరంగల్‌లో 12 స్థానాలకు 11 స్థానాలకు సోమవారం అభ్యర్థులను ప్రకటించిన గులాబీ నేత.. జనగామ అభ్యర్థిత్వాన్ని పెండింగ్‌లో పెట్టారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు మళ్లీ అవకాశం ఇవ్వలేదు. ములుగు నియోజకవర్గం నుంచి జెడ్పీ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతిని బరిలోకి దింపుతున్నారు. ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో 'సిట్టింగ్'లను మార్చుతారనే ప్రచారం జోరుగా సాగింది. ఈసారి ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీలు, ఎంపీలు ఎమ్మెల్యేలుగా బరిలోకి దిగుతారని కూడా ప్రచారం జరిగింది. కానీ ఆ ప్రచారాన్ని పటాపంచలు చేసేలా కేసీఆర్ కేవలం ఒకే ఒక ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి మాత్రమే ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో ఆశావహుల ఆశలన్నీ ఆవిరి కాగా.. తొమ్మిది మంది సిట్టింగ్‌లకు మళ్లీ పోటీ చేసే అవకాశం దక్కింది. మహబూబాబాద్, డోర్నకల్, భూపాలపల్లి, వరంగల్ తూర్పు నుంచి టికెట్ వస్తుందని భావించిన మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీలు మాలోతు కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య ప్రస్తావన లేకుండా పోయింది.

మొదటి సారి నాగజ్యోతి.. ఎనిమిదోసారి రెడ్యానాయక్

తాజాగా ప్రకటించిన బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితాలో ప్రత్యేకతలు ఉన్నాయి. ములుగు నుంచి అభ్యర్థిగా ఎంపికైన బడే నాగజ్యోతి మొదటిసారిగా అసెంబ్లీకి పోటీ చేస్తుండగా.. మాజీ మంత్రి, డోర్నకల్ సిట్టింగ్ ఎమ్మెల్యే ధరంసోతు రెడ్యానాయక్ ఎనిమిదోసారి అసెంబ్లీ బరిలో నిలుస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రెడ్యానాయక్.. ఒక్కసారి మాత్రమే సత్యవతి రాథోడ్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఇటీవల ఆయనపై కొంత వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో ఆయనకు బదులు కుటుంబంలో ఒకరికి లేదా మంత్రి సత్యవతికి అవకాశం ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ రెడ్యానాయక్ ఇది నాకు చివరి ఎన్నిక.. భవిష్యత్‌లో పోటీ చేయనని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో మరోసారి ఎన్నికల బరిలో నిలిచే అవకాశం దక్కింది. ఓటమెరుగని నేతగా సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఒకసారి ఎంపీ, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మూడు సార్లు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఎన్నికై, మరో మూడుసార్లు (2009, 2014, 2018లలో) పాలకుర్తి నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న దయాకర్‌రావు ఏడోసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీ బరిలో నిలుస్తున్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి ఇప్పటికే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఐదోసారి తలపడనున్నారు. 2014, 2018లలో వర్ధన్నపేట నుంచి గెలుపొందిన అరూరి రమేష్ హ్యాట్రిక్ దిశగా మూడోసారి బరిలో నిలవనున్నారు. అదే విధంగా పరకాల నుంచి ఇప్పటికే రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చల్లా ధర్మారెడ్డి సైతం ఇదే రేసులో ఉన్నారు. మహబూబాబాద్ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బానోత్ శంకర్‌నాయక్ సైతం హ్యాట్రిక్ ఆశల్లో ఉన్నారు. ఉద్యమనేతగా ఎదిగిన పెద్ది సుదర్శన్‌రెడ్డి నర్సంపేట నుంచి రెండుసార్లు పోటీ చేసినప్పటికీ 2018లో గెలుపొందారు. మూడోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలుపొంది బీఆర్‌ఎస్‌లో చేరిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కారు గుర్తుపై తొలిసారి పోటీ చేయనున్నారు. వరంగల్ తూర్పు నుంచి రెండోసారి నన్నపునేని నరేందర్ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు.

నియోజకవర్గం	అభ్యర్థి పేరు	సామాజికవర్గం
పాలకుర్తి	ఎర్రబెల్లి దయాకర్‌రావు	ఓసీ–వెలమ
వరంగల్ తూర్పు	నన్నపునేని నరేందర్	బీసీ–మున్నూరుకాపు
వరంగల్ పశ్చిమ	దాస్యం వినయ్‌భాస్కర్	బీసీ–మున్నూరుకాపు
నర్సంపేట	పెద్ది సుదర్శన్ రెడ్డి	ఓసీ–రెడ్డి
పరకాల	చల్లా ధర్మారెడ్డి	ఓసీ–రెడ్డి
భూపాలపల్లి	గండ్ర వెంకటరమణారెడ్డి	ఓసీ–రెడ్డి
స్టేషన్‌ఘన్‌పూర్	కడియం శ్రీహరి	ఎస్సీ–బైండ్ల
వర్ధన్నపేట	అరూరి రమేష్	ఎస్సీ–మాదిగ
డోర్నకల్	డీఎస్ రెడ్యానాయక్	ఎస్టీ–లంబాడా
మహబూబాబాద్	బానోత్ శంకర్‌నాయక్	ఎస్టీ–లంబాడా
ములుగు	బడే నాగజ్యోతి	ఎస్టీ–కోయ
జనగామ	(ఇంకా ఖరారు కాని అభ్యర్థిత్వం)	

అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసం - 8లో▸

ఓరుగల్లు నుంచే ఎన్నికల శంఖారావం - 10లో▸

పెరిగిన ఓటర్లు

- భూపాలపల్లి నియోజకవర్గంలో 2,63,452

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి నియోజకవర్గంలో 4,784 మంది నూతన ఓటర్లు పెరిగారు. సోమవారం రాత్రి కేంద్ర ఎన్నికల సంఘం రెండవ ముసాయిదా జాబితాను విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,63,452 మంది ఓటర్లు ఉన్నారు. 1,32,118 (50.15శాతం) పురుష ఓటర్లు, 1,31,330 (49.85శాతం) మహిళా ఓటర్లు, నలుగురు థర్డ్ జెండర్ ఓటర్లు నమోదై ఉన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

ముసాయిదా జాబితాపై సెప్టెంబర్ 19వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. వచ్చిన అభ్యంతరాలను సెప్టెంబర్ 28వ తేదీ వరకు పరిశీలించి అక్టోబర్ 4వ తేదీన ఫైనల్ జాబితాను విడుదల చేయనున్నారు. నియోజకవర్గంలో అభ్యంతరాలు ఉంటే బీఎల్‌ఓ, తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం, కలెక్టరేట్‌లోని ఎలక్షన్ సెల్‌లో ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంది.

మండలాల వారీగా ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
భూపాలపల్లి	37,745	35,965	1	73,711
చిట్యాల	14,383	14,747	1	29,131
గణపురం	15,084	15,226	2	30,312
మొగుళ్లపల్లి	14,233	14,370	0	28,603
రేగొండ	23,925	24,263	0	48,188
శాయంపేట	16,151	16,323	0	32,474
టేకుమట్ల	10,597	10,436	0	21,033
మొత్తం	1,32,118	1,31,330	4	2,63,452

మద్యం దుకాణాలకు లక్కీ డ్రా



మద్యం షాపులకు డ్రాలు తీస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి రూరల్: జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలలోని మద్యం దుకాణాలకు సోమవారం కలెక్టర్ భవేష్‌మిశ్రా లక్కీ డ్రా తీశారు. జిల్లా కేంద్రంలోని సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డ్రా నిర్వహించారు. కలెక్టర్ పాల్గొని డ్రా తీశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు డ్రా ప్రక్రియ కొనసాగింది. ములుగు జిల్లాలోని మల్లంపల్లి షాపునకు అత్యధికంగా 125 దరఖాస్తులు రాగా శాయంపేట మండల కేంద్రానికి చెందిన బోలగాని లావణ్య షాపును దక్కించుకున్నారు. రెండు జిల్లాల పరిధిలో మొత్తం 60 షాపులకు 2,060 దరఖాస్తులు వచ్చాయి. డ్రా తీయాలంటే కనీసం ఒక షాపునకు పది టెండర్లు(దరఖాస్తులు) రావాల్సి ఉంది. చల్వాయి(5)దరఖాస్తులు, తాడ్వాయి(6), ఊరట్టం (8) దరఖాస్తులు రావడంతో ఈ మూడు షాపులకు డ్రాను నిలిపి వేసి 57 షాపులకు మాత్రమే డ్రా తీశారు. తక్కువ దరఖాస్తులు వచ్చిన ఈమూడు షాపులకు త్వరలో దరఖాస్తులు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్సై మాన్‌సింగ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబురాలు



పార్టీ కార్యాలయంలో సంబురాలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికే తిరిగి బీఆర్‌ఎస్ టికెట్ కేటాయించడం పట్ల జిల్లాకేంద్రంలో పార్టీనాయకులు సోమవారం సంబురాలు చేసుకున్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి గణేష్‌చౌక్ అక్కడి నుంచి బీఆర్‌ఎస్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్లలో బాణసంచా పేల్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్, ప్రజాప్రతినిధులు, నాయకులు సెగ్గం వెంకటరాణిసిద్దు, హరిబాబు, బుర్ర రమేష్, వెంకన్న, అశోక్. నారాయణ, శ్రీనివాస్, రమేష్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

తల్లిదండ్రులను దైవంగా పూజించాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి



వృద్ధులను సన్మానిస్తున్న జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లి రూరల్: తల్లిదండ్రులను దైవంగా పూజించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.జయరాంరెడ్డి అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అమృతవర్షిణి అక్షర స్వచ్ఛంద సేవా సంస్థ భవనంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్జి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను అనాథలుగా వదిలేయవద్దన్నారు. తల్లిదండ్రుల దీవెన ఉంటేనే పిల్లలు బాగుపడతారన్నారు. వృద్ధాశ్రమంలో సేదదీరుతున్న పెద్దలతో జడ్జి ముచ్చటించారు. ప్రభుత్వం తరఫున సహాయం కావాలంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి నాదెండ్ల రామచంద్ర రావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏదులాపురం శ్రీనివాస్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మెరుగు రవీందర్, న్యాయవాదులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్: గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ పోరిక సమ్మయ్యనాయక్ అధ్యక్షతన మంథని నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించిన ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎస్టీ సామాజిక వర్గంలో ఉన్న వారిని చైతన్యపరిచి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషిచేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి మొదలుకుని జిల్లాస్థాయి వరకు పూర్తిస్థాయి కమిటీలు నిర్మించుకొని పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలన్నారు. ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన లకావత్ సమేందర్‌కు ప్రకాశ్‌రెడ్డి నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, వివిధ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులదే కీలక పాత్ర

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులదే కీలకపాత్ర అని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ గాష్ ఆలంతో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు సెక్టోరల్ అధికారులను నియమించి శిక్షణ ఇవ్వాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఒక్కో రిటర్నింగ్ అధికారి కింద 20 నుంచి 30 సెక్టార్లు ఉంటాయని తెలిపారు. సెక్టార్ పరిధిలో 10 నుంచి 20 పోలింగ్ కేంద్రాలు ఉంటాయని వివరించారు. ఎన్నికల సమయంలో సెక్టార్ అధికారులకు మెజిస్టీరియల్ పవర్స్ ఉంటాయన్నారు.

నాయకుల ఆందోళన

కాటారం: కాటారం మండలం బస్వాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పోశయ్య మృతి చెందగా నాయకపోడ్ సంఘం నాయకులు బస్వాపూర్ వద్ద ఆందోళన చేపట్టారు. ఘటన జరిగిన కొద్ది సమయంలోనే మృతదేహాన్ని, ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను ఘటనా స్థలం నుంచి పోలీసులు ఎలా తరలిస్తారని వారు ప్రశ్నించారు. ప్రమాదానికి గురైన బొగ్గు టిప్పర్‌ను ఘటనా స్థలానికి తెప్పించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ధర్నాను విరమింపజేశారు. నాయక్‌పోడ్ సంఘం నాయకులు గొట్టం భూమయ్య, బీసుల లక్ష్మయ్య, గడవేణ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భూపాలపల్లి రూరల్: ప్రజావాణి దరఖాస్తులను అధికారులు సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఇల్లందు క్లబ్ హౌస్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ప్రజల నుంచి 12 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

డీపీఓకు సన్మానం



మల్హర్: మండలంలో తాడిచర్ల గ్రామాన్ని సందర్శించడానికి వచ్చిన డీపీఓ ఆశాలతను పంచాయతీ కార్యదర్శులు సోమవారం సన్మానించారు. ఇటీవల ఉత్తమ అధికారిగా ఎనికై సీఎం కేసీఆర్ ద్వారా అవార్డు తీసుకున్న సందర్భంగా తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సత్కరించి బొకేను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, ఎంపీడీఓ నర్సింహమూర్తి, పీఆర్‌ఏఈ అశోక్ ఎంపీఓ విక్రమ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రామప్పలో శ్రావణ సందడి



నాగబ్రహ్మ క్షేత్రం వద్ద చేస్తున్న యజ్ఞం

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని రామప్ప దేవాలయంలో శ్రావణ సందడి నెలకొంది. సోమవారం నాగుల పంచమి సందర్భంగా వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్‌లు పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మహిళలు నాగుల పంచమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలు పోసి కొబ్బరి కాయలు కొట్టి పూలు, పండ్లు నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. పాలంపేట శివారులోని నాగబ్రహ్మ క్షేత్రం వద్ద వీరమల్లు శ్రీనివాసరావు దంపతులు యజ్ఞం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు సమర్పించారు.

నాగుల పంచమి



నాగుల పంచమి, శ్రావణ సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు ఉదయం భారీగా వచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఆలయ ఆవరణలో ఉన్న పుట్టల్లో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు.

- టేకుమట్ల(రేగొండ)

అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసం

బీఆర్‌ఎస్ దళపతి అసెంబ్లీ అభ్యర్థుల ప్రకటనతో సుదీర్ఘకాలంగా నెలకొన్న అనుమానాలు, సందేహాలకు తెరపడింది. బరిలో నిలిచిన గెలుపుగుర్రాల్లో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ.. అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేశాం.. మళ్లీ ఆదరిస్తే నియోజకవర్గాలను మరింత అభివృద్ధి చేస్తామంటున్నారు. పార్టీ శ్రేణులతో కలిసి సంబురాలు చేసుకున్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్

పేరు: కడియం శ్రీహరి
తండ్రి: లక్ష్మీనర్సయ్య (లేట్)
తల్లి : వెంకటమ్మ
భార్య: కడియం వినయరాణి
సంతానం: ముగ్గురు కుమార్తెలు
పుట్టిన తేదీ: 08.07.1950
స్వగ్రామం: పర్వతగిరి
విద్యార్హతలు: ఎంఎస్సీ(కెమిస్ట్రీ)
పర్మినెంట్ అడ్రస్: ఇంటి నంబర్: 2-7-1041/3, రోడ్ నంబర్ 2
కనకదుర్గా కాలనీ, వడ్డేపల్లి, హన్మకొండ, హనుమకొండ జిల్లా
అడ్రస్ ఫర్ కమ్యూనికేషన్: క్వార్టర్ నంబర్ 14, మినిస్టర్స్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్, రోడ్ నంబర్ 12,
బంజారాహిల్స్, హైదరాబాద్
ఈమెయిల్: కడియం.శ్రీహరి9ఃజీమెయిల్ డాట్ కామ్
కాంటాక్ట్ నంబర్: 9849488911
రాజకీయ అనుభవం:

- 1994లో టీడీపీ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా గెలుపొంది ఎన్‌టీఆర్ ప్రభుత్వంలో మార్కెటింగ్, గిడ్డంగుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.
- 1999లో రెండోసారి టీడీపీ నుంచి గెలుపొంది చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో సాంఘిక సంక్షేమశాఖ, విద్యా శాఖ, భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు.
- 2008 ఉప ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 15.03. 2015లో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.
- 2014లో బీఆర్‌ఎస్ నుంచి వరంగల్ ఎంపీగా అధిక మెజార్టీతో విజయం సాధించారు.
- 2015 జనవరి 25న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. 11.12.2018 వరకు డిప్యూటీ సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు.
- 04.06.2015 నుంచి 03.06. 2021 వరకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా కొనసాగారు.
- 22.11.2021 నుంచి రెండోసారి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు.

అత్యధిక మెజార్టీతో గెలుస్తాం : గండ్ర

భూపాలపల్లి అర్బన్ : నియోజకవర్గ ప్రజలకు 24 గంటలూ సేవలందిస్తున్నానని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ సోమవారం.. 2023 అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్‌ఎస్ జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా గండ్ర వెంకటరమణారెడ్డిని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గండ్ర 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. 'గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో గెలిచి నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్‌ఎస్‌లో చేరాం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాం. ఇందులో భాగంగా ప్రజలకు చిరస్థాయిలో గుర్తుండిపోయే అభివృద్ధి పనులు చేపట్టాం. త్వరలో జరిగే శాసనసభ ఎన్నికల్లో కూడా భూపాలపల్లి నుంచి అత్యధిక మెజార్టీ గెలుస్తాం. అనంతరం జిల్లా కేంద్రంతో భూపాలపల్లి నియోజకవర్గ సమగ్రభివృద్ధికి కృషి చేస్తాం' అని గండ్ర అన్నారు.

జయశంకర్ భూపాలపల్లి

అభ్యర్థి పేరు: గండ్ర వెంకటరమణారెడ్డి
తండ్రి: మోహన్‌రెడ్డి
పుట్టిన తేదీ: మే 5, 1966
విద్య: డిప్లొమా
భార్య: గండ్ర జ్యోతి
సంతానం: కుమారుడు, కూతురు
ఫోన్ నంబర్: 9441939999
ఇంటి అడ్రస్: ఇంటి నంబర్ 81/ఏ/ఎఫ్/3 ఎమ్మెల్యే కాలనీ, రోడ్ నంబర్-12 బంజారాహిల్స్, హైదరాబాద్
రాజకీయ అనుభవం : 2009, 2018 సంవత్సరాల్లో ఎమ్మెల్యేగా గెలుపు

రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపా : ఎర్రబెల్లి

జనగామ/పాలకుర్తి: : సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎనిమిదోసారి ఎమ్మెల్యేగా బరిలో దిగనున్నారు. ఇప్పటికే ఏడుసార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి వరంగల్‌గా ఎంపీగా విజయం సాధించి ఓటమి ఎరగని నేతగా ప్రజలకు సేవలందిస్తున్న దయాకర్‌రావుకు.. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం వచ్చింది. ఈ నేపథ్యంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపానన్నారు. ప్రజలు మరో అవకాశం ఇస్తే... సేవకుడిలా పని చేసి, రుణం తీర్చుకుంటామన్నారు. పాలకుర్తి ప్రజలు తమకు సేవ చేసే వారిని ఎప్పుడూ మరచిపోరన్నారు. ప్రతీ గ్రామంలో రహదారుల నిర్మాణం చేపట్టి ప్రయాణ కష్టాలు తొలగించామన్నారు. దీంతో ప్రయాణం సాఫీగా సాగుతోందన్నారు. కాగా, తనకు 8వసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఎర్రబెల్లి కృతజ్ఞతలు తెలిపారు.

పాలకుర్తి

పూర్తి పేరు: ఎర్రబెల్లి దయాకర్‌రావు
తండ్రి పేరు: జగన్నాథరావు
తల్లి పేరు: ఆదిలక్ష్మి
భార్య పేరు: ఉషారాణి
కొడుకు, కోడలు: ప్రేమ్‌చందర్‌రావు,మహతి
కూతురు, అల్లుడు: ప్రతిమ, మదన్‌మోహన్‌రావు
స్వగ్రామం: గ్రామం, మండలం పర్వతగిరి, జిల్లా వరంగల్
చిరునామా : ఇంటి నంబరు 2-4-136, రాంనగర్, హనుమకొండ 506001
పుట్టిన తేదీ: 04-07-1956
విద్యార్హతలు: ఇంటర్మీడియట్
రాజకీయ రంగప్రవేశం

- 1982లో టీడీపలో చేరిక, ప్రథమ ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ కన్వీనర్‌గా నియమాకం, ఆ ఏడాదిలోనే జిల్లా కార్యదర్శితోపాటు వర్ధన్నపేట నియోజకవర్గ బాధ్యతల స్వీకరణ.
- 1983లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి.
- 1987లో పర్వతగిరి మండల కల్లెడ గ్రామ సొసైటీ చైర్మన్‌గా ఏకగ్రీవ ఎన్నిక
- 1994 ,1999, 2004 సంవత్సరాల్లో వరుసగా వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 2009 , 2014, 2018 సంవత్సరాల్లో వరుసగా పాలకుర్తి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 1999లో టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ విప్‌గా, ఆ పార్టీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడిగా నియామకం.
- 2019 నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పంచాయతీరాజ్, గ్రామీణభివృద్ధి శాఖల మంత్రిగా విధుల నిర్వర్తింపు

వరంగల్ పశ్చిమ

పేరు: దాస్యం వినయ్ భాస్కర్
తండ్రి: రంగయ్య,
తల్లి: శిలోత్రి దేవి
పుట్టిన తేదీ: 1969, నవంబర్ 22
విద్యార్హతలు: ఎంఏ పొలిటికల్ సైన్స్
వృత్తి: వ్యాపారం, రాజకీయాలు
జీవిత భాగస్వామి: రేవతి భాస్కర్
కూతురు: కృషికా భాస్కర్
కుమారుడు: కృష్ణవ్ భాస్కర్
కులం: బీసీ-డి (మున్నూరు కాపు)
స్వస్థలం: వడ్డేపల్లి, హనుమకొండ
రాజకీయ అనుభవం...

- 1999, 2004లో హనుమకొండ శాసనసభ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ
- 2005లో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడిగా నియామకం.
- 2005లో కార్పొరేటర్‌గా ఎన్నిక
- 2009, 2010, 2014, 2018 సంవత్సరాల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక
- 2015లో పార్లమెంటర్ కార్యదర్శిగా (సహాయ మంత్రి హోదా) నియామకం
- 2019లో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్‌గా, 2022లో బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా నియామకం

ప్రజల ఆకాంక్ష మేరకు : దాస్యం

హన్మకొండ: ప్రజల ఆకాంక్ష మేరకు పని చేశానని ప్రభుత్వ చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సీఎం కేసీఆర్.. బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థిగా మరోసారి అవకాశం కల్పించిన సందర్భంగా చీఫ్ విప్ 'సాక్షి'తో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు ఆదరించి నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతీ సమస్య పరిష్కారానికి కృషి చేశానన్నారు. అదే విధంగా పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నానన్నారు. అధిష్టానానికి విధేయుడిగా ఉంటానన్నారు. పార్టీ తనపై ఎంతో నమ్మకం ఉంచి కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలకు మరింత సేవ చేసేందుకు ఉపయోగిస్తానన్నారు. తన వెన్నంటి ఉంటున్న నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పటిలాగే పాలు పంచుకుంటానన్నారు. ప్రజలు మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని ధాస్యం వినయ్ భాస్కర్ కోరారు.

కేసీఆర్‌కు రుణపడి ఉంటా : శంకర్

మహబూబాబాద్: 'నాపై నమ్మకంతో సీఎం కేసీఆర్.. బీఆర్‌ఎస్ మహబూబాబాద్ అసెంబ్లీ అభ్యర్థిగా మరోసారి అవకాశం కల్పించారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయను.. సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని' మానుకోట ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. సీఎం కేసీఆర్ సోమవారం.. బీఆర్‌ఎస్ మానుకోట అభ్యర్థిగా శంకర్‌నాయక్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. '24 గంటలు నియోజకవర్గంలో ఉంటూ కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటా. మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్, నర్సింగ్ కాలేజీ, కలెక్టరేట్ మంజూరు చేసి మానుకోటపై సీఎం కేసీఆర్ తన ప్రేమను చాటుకున్నారు. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన. మానుకోట పట్టణ రూపురేఖలు మారాయి. మరోసారి అవకాశం కల్పించడంతో గెలిచి మరింత అభివృద్ధి చేస్తా. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని' శంకర్‌నాయక్ అన్నారు.

మహబూబాబాద్

అభ్యర్థి పేరు : బానోత్ శంకర్‌నాయక్
తండ్రి పేరు : బానోత్ కేస్లానాయక్
తల్లి పేరు : బాజు బాయి
భార్య పేరు : సీతామహాలక్ష్మి
కూతురు : తేజస్వి
కుమారుడు : సూర్యచంద్ర
జన్మస్థలం : ఊకల్ జీపీ పరిధి, బాలాజీ నగర్ తండా, రాయపర్తి మండలం, వరంగల్ జిల్లా
పుట్టిన తేదీ : 20-05-1965
కులం : లంబాడ
చిరునామా : ఇంటి నెంబర్ 5-4-79, ఎల్‌ఐసీ ఆఫీస్ ప్రక్కన, మహబూబాబాద్
- ఇంటి నంబర్ 1-7-930 ఏకశిల కాలనీ హంటర్‌రోడ్, హనుకొండ
విద్యార్హతలు : బీటెక్ (ఆర్‌ఈసీ - నిట్ వరంగల్) ఎంబీఏ(కేయూ వరంగల్)
రాజకీయ అనుభవం..

- 2014, 2018 సంవత్సరాల్లో బీఆర్‌ఎస్ నుంచి మహబూబాబాద్ ఎమ్మెల్యేగా గెలుపు

ముచ్చటగా మూడోసారి : అరూరి రమేష్

సాక్షి, వరంగల్: ముచ్చటగా మూడోసారి ఘన విజయం సాధిస్తానని బీఆర్‌ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ సోమవారం.. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్‌ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థిగా అరూరి రమేష్‌ను ప్రకటించారు. ఈ నేపథ్యంలో 'సాక్షి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ తనపై ఏర్పరుచుకున్న నమ్మకాన్ని గెలుపు రూపంలో చూపెడతానని తెలిపారు. ఇప్పటికే 2014లో 87వేలపైచిలుకు, 2018 సంవత్సరం ఎన్నికల్లో 99,240 ఓట్ల మెజారిటీతో గెలిచిన తాను నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని చెప్పారు. 'అక్కడక్కడ నేతల మధ్య వచ్చిన కొన్ని మనస్పర్థలు సర్దుకున్నాయి. పార్టీ కోసం అందరం కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. దీనిపై పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేశారు. తొమ్మిదేళ్లుగా చేసిన అభివృద్ధి పనులతో పాటు ఇప్పటికీ జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తానని' అరూరి రమేష్ అన్నారు.

వర్ధన్నపేట

పేరు: అరూరి రమేష్
తండ్రి: గట్టుమల్లు(లేట్)
తల్లి: వెంకటమ్మ
భార్య: కవితకుమారి
కుమారుడు: విశాల్
కుమార్తె: అక్షిత
గ్రామం: ఉప్పుగల్లు
మండలం: జఫర్‌గఢ్
జిల్లా: జనగామ
పుట్టిన తేదీ: 4.4.1967
కులం: మాదిగ (ఎస్సీ)
రిలిజియన్: హిందూ
నేషనాలిటీ : ఇండియన్
విద్యార్హత: ఎంఏ సోషియాలజీ, (ఎల్‌ఎల్‌బీ)
కరస్పాండెన్స్ అడ్రస్: 1-1-374 ప్రశాంత్‌నగర్, హనుమకొండ
సెల్ నంబర్: 9494326666

రాజకీయ అనుభవం, పదవులు..

- 1994లో టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడిగా నియామకం
- 1997లో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడిగా నియామకం
- 2009లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ, పీఆర్‌పీ జిల్లా అధికార ప్రతినిధిగా విధుల నిర్వర్తింపు.
- 2014లో తెలంగాణ కవులు, కళాకారుల కళా సంఘం గౌరవ అధ్యక్షుడిగా విధుల నిర్వర్తింపు
- 2014లో వర్ధన్నపేట నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా 87 పైచిలుకు ఓట్లతో విజయం
- 2015 నుంచి 2018 వరకు తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ చైర్మన్‌గా విధుల నిర్వర్తింపు
- 2018లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా 99 వేల 240 ఓట్ల మెజారిటితో ఘన విజయం సాధించి రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచారు.
- 2022 నుంచి బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

అభివృద్ధిని ఆశీర్వదిస్తారు : పెద్ది

సాక్షి, వరంగల్: 'వరంగల్ జిల్లా అనగానే వెంటనే గుర్తొచ్చేలా నర్సంపేట నియోజక వర్గాన్ని తీర్చిదిద్దుతున్నా. ఇప్పటికే జిల్లా ఆస్పత్రితో పాటు మెడికల్ కాలేజీని కూడా మంజూరు చేయించా. 250 పడకల ఆస్పత్రిని 650 పడకలుగా అప్‌గ్రేడ్ చేసేలా చూశా. నల్లబెల్లి మండలం కన్నారావుపేటలో హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ మంజూరు చేయించా' అని పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ సోమవారం.. 2023 అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్‌ఎస్ నర్సంపేట నియోజకవర్గ అభ్యర్థిగా పెద్ది సుదర్శన్ రెడ్డిని ప్రకటించారు. ఈ నేపథ్యంలో 'సాక్షి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. 'పట్టాలులేని రైతులందరికీ ఆర్‌వోఎఫ్‌ఆర్ ఇప్పించా. పాకాల మున్నేరు వాగుపై రూ.20 కోట్లతో చెక్‌డ్యామ్, వట్టివాగుపై రూ.18 కోట్లతో చెక్ డ్యామ్ కమ్ రోడ్డు కోసం నిధులు మంజూరు చేయించా. ఇలా ఓవైపు అభివృద్ధి పనులు చేస్తూనే.. మరోవైపు సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా కృషి చేస్తున్నా. మరోసారి ప్రజలు ఆశీర్వదిస్తే వాటన్నింటిని వంద శాతం పూర్తి చేసేలా ముందుకు వెళ్తా' అని పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి అన్నారు.

నర్సంపేట

అభ్యర్థి పేరు : పెద్ది సుదర్శన్‌రెడ్డి
జననం : 1974 ఆగస్టు 6న
తల్లిదండ్రులు : రాజిరెడ్డి, అమృతమ్మ
భార్య : స్వప్న
సంతానం : నిదర్శన్‌రెడ్డి, ధర్మిష్టరెడ్డి
జన్మస్థలం : నల్లబెల్లి మండల కేంద్రం వరంగల్ జిల్లా
విద్యార్హతలు : ఇంటర్మీడియట్
రాజకీయ జీవితం

- 2001లో నల్లబెల్లి జెడ్పీటీసీగా గెలుపొంది జెడ్పీ ఫ్లోర్ లీడర్‌గా ఎన్నిక
- 2004లో బీఆర్‌ఎస్ జిల్లా కన్వీనర్‌గా నియామకం
- 2005లో రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా ఎన్నిక నియామకం
- 2006 నుంచి 2014 వరకు పార్టీ జిల్లా పొలిటికల్ బ్యూరో సభ్యుడిగా విధుల నిర్వర్తింపు
- 2014లో బీఆర్‌ఎస్ నుంచి నర్సంపేట అసెంబ్లీ స్థానానికి పోటీ.. ఓటమి
- 2018లో బీఆర్‌ఎస్ నుంచి నర్సంపేట అసెంబ్లీ స్థానానికి పోటీ..గెలుపు

EDUCATION

OPEN ADMISSIONS

- Open 10th open Inter One Sitting admissions Last date 30-08-2023. Contact: Phone No: 7396135390. [W-189140]

REAL ESTATE

FARM PLOTS FOR SALE

- ఆనందవనం ఫేస్ 7 నందు ఫామ్ ల్యాండు కొలన్‌పాక, యాదాద్రి నందు ఫామ్ ల్యాండు ఆఫర్ 5+1 ప్లాట్ నందు 5 తీసుకొన్న 1 ప్లాట్ ఫ్రీ Plot Rate 4999/-. సంప్ర॥ 9014743326. [W-189141]

PLOT FOR SALE

- మన వరంగల్‌లోని శంభునిపేట సమీపంలో నాయుడు పెట్రోల్ పంపు, వినాయకనగర్‌లో 170 గజాల Open Plot కలదు. సంప్ర॥ సెల్: 9849063958. [W-189138]
- వరంగల్ జాన్ పీరీలు రైల్వే గేట్ ప్రక్కన్న 109 గజాల ఉత్తరం ఫేస్ గల Open Plot అమ్మబడును వివరాలకు సంప్ర॥ సెల్: 9849459661. [W-189137]

HOUSE FOR SALE

- ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్లె 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన బట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent House అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27210]
- మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చ॥గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి. సెల్: 9032111600. [W-785647]

FLATS FOR SALE

- KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డు, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27213]

SERVICES

- సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-189136]
- హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్థులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-189122]

LOANS

- బాలాజీ లోన్స్ : మార్టిగేజ్ లోన్, పర్సనల్ లోన్ బిజినెస్ లోన్, I.T. రిటన్స్ (G.S.T.) చేయబడును. కాకతీయ టాకీస్, వరంగల్. లేడి రిసెప్షనిస్ట్ కావలెను. సంప్ర. 8522825358 [M-1221525]

WANTED

- GNM Nurses Dialysis & LAB Technicians required for Guardian Hospital, Opp: LB College, Mulugu "X" Road, WGL. 12 to 2PM. [WA-963]
- (1) Computer Operator - Ladies age 18 to 35, (2) Supervisor - Boys age 18 to 30. Qua: Inter to Degree Cell: 9866606966, కాజీపేట్, మడికొండ, కడిపికొండ నివాసం గలవారు కావలెను. [W-785650]
- వరంగల్‌లో వాషింగ్ మిషన్ రిపేర్ చేయడానికి టెక్నీషియన్ కావలెను. (బైక్ తప్పనిసరి+ పెట్రోల్ అలవెన్స్+ మంచి జీతం ఇవ్వబడును) సంప్ర॥ 8179585395. [WA-1110397]
- మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221522]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్ : 9640258899, 9640468899 [HA-189323]
- షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పని చేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, వార్డ్‌బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9391036931, 9246585901 [HA-12052]

WANTED TEACHERS

- Wanted Applications from Qualified and experienced teachers having excellent communcation skills for all subjects (Pre Primary, Primary and Upper Primary) Salary: 10K to 12K, IIT, Bilology & Telugu (High School) Salary: 10K to 20K. Contact Immediately. Shantiniketan High School, Near Durgeshwara Swamy Temple, Warangal, Cont No: 7995850051. [WA-16683]

అందరినీ కలుపుకుంటూ : నన్నపునేని

సాక్షి, వరంగల్: 'రూ.నాలుగువేల కోట్లతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రోడ్లు, అంతర్గత డ్రైనేజీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఆధునిక బస్టాండ్, కలెక్టరేట్, సమీకృత మార్కెట్లు, నాలాల విస్తరణ పనులు చేస్తున్నాం' అని నన్నపునేని నరేందర్ తెలిపారు. సీఎం కేసీఆర్ సోమవారం.. 2023 అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్‌ఎస్ వరంగల్ తూర్పు నియోజకవర్గ అభ్యర్థిగా నన్నపునేని నరేందర్‌ను ప్రకటించారు. ఈ నేపథ్యంలో 'సాక్షి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. 'తనను మరోసారి గెలిపిస్తే రాబోయే రోజుల్లో పరిశ్రమలు తీసుకొచ్చి వేలాది మందికి ఉపాధి అవకాశాలు దక్కేలా చూస్తా. ఇప్పటికే పేదలకు జీవో 58 కింద పట్టాలు అందించాం. పర్యాటక ప్రదేశంగానూ వరంగల్‌ను తీర్చిదిద్దుతున్నాం. ఈ అంశాలతో ప్రజల్లోకి వెళ్లి ఆశీర్వదించామని అడుగుతాను. అదే సమయంలో ముఖ్య నేతలందరితోపాటు కార్పొరేటర్లు, కార్యకర్తలతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించి కలిసికట్టుగా బీఆర్‌ఎస్ గెలుపునకు పనిచేస్తాం' అని నరేందర్ అన్నారు.

వరంగల్ తూర్పు

అభ్యర్థి పేరు : నన్నపునేని నరేందర్
జననం: 5 ఆగష్టు 1972
తల్లిదండ్రులు: నర్సింహామూర్తి, కాంతమ్మ
జీవిత భాగస్వామి : వాణి
సంతానం: లోకేష్ పటేల్, మనుప్రీత్‌పటేల్
రాజకీయ జీవితం..

- 1995 కల్పలత సూపర్ బజార్ డైరెక్టర్‌గా ఎన్నిక
- 1995 తెలుగుదేశం పార్టీలో చేరిక
- 1997లో టీడీపీ డివిజన్ కార్యదర్శి, డివిజన్ అధ్యక్షుడిగా నియామకం
- 2004లో టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియామకం
- 2005లో గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలుపు
- 2008లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకం
- 2009లో బీటీఆర్‌ఎస్‌లో చేరిక
- 2010లో ఆర్టీసీ నేషనల్ మజ్దూరు యూనియన్ నగర అధ్యక్షుడిగా నియామకం
- 2011లో ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియామకం
- 2012లో తెలంగాణ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియామకం
- 2014లో బీఆర్‌ఎస్ గ్రేటర్ అధ్యక్షుడిగా నియమాకం
- 2016లో మేయర్‌గా ఎన్నిక
- 2018 సంవత్సరంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొంది కొనసాగుతున్నారు.

పరకాల

పేరు: చల్లా ధర్మారెడ్డి
నియోజకవర్గం: పరకాల
జననం: 1968 సెప్టెంబర్ 8
తల్లిదండ్రులు: మల్లారెడ్డి-సమ్మక్క
భార్య: జ్యోతి
కుమార్తెలు: మానసరెడ్డి, జాహ్నవిరెడ్డి
వృత్తి: వ్యాపారం
విద్యార్హతలు: గ్రాడ్యుయేషన్
నివాసం: నక్కలగుట్ట, హనుమకొండ

రాజకీయ అనుభవం:
టీడీపీతో రాజకీయ జీవితం ప్రారంభం. 2014లో తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో టీడీపీ తరపున పరకాల నుంచి పోటీ చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి ముద్దసాని సహోదర్‌రెడ్డిపై 9108 ఓట్ల మెజారీటితో గెలుపు. 2018లో బీఆర్‌ఎస్‌లో చేరిక. 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖపై 46,519 ఓట్ల మెజారీటీతో గెలుపు.

డోర్నకల్

పేరు: ధరంసోత్ రెడ్యానాయక్
పుట్టినతేదీ: ఆగస్టు 20, 1952
స్వగ్రామం: ఉగ్గంపల్లి
తల్లిదండ్రులు: రామునాయక్, మంగమ్మ
భార్య : లక్ష్మి
కుటుంబం: కుమారులు రవిచంద్ర, రాజేంద్రప్రసాద్, కుమార్తె కవిత(మహబూబాబాద్ ఎంపీ)
విద్యార్హత: డిగ్రీ
పదవులు: ఉగ్గంపల్లి సర్పంచ్, పంచాయతీ ప్రెసిడెంట్, మరిపెడ ఎంపీపీ, ఆరుసార్లు ఎమ్మెల్యే, వైఎస్ హయాంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి
ఎమ్మెల్యేగా: 1989, 94, 99, 2004, 2014, 2018 సంవత్సరాల్లో గెలుపు

ములుగు

పేరు: బడే నాగజ్యోతి
తండ్రి: నాగేశ్వరరావు
తల్లి: రాజేశ్వరి
భర్త: ఎట్టి జగదీష్
కుమారుడు: గహన్ శివన్ ధ్రువణ్
గ్రామం: కాల్వపల్లి
మండలం: ఎస్‌ఎస్ తాడ్వాయి
జిల్లా: ములుగు
పుట్టిన తేదీ: 05-01-1994
కులం: ఆదివాసీ(ఎస్టీ)
రిలిజియన్ : హిందూ
నేషనాలిటీ: ఇండియన్
విద్యార్హత: ఎమ్మెస్సీ బాటనీ, బీఈడీ
అడ్రస్: కాల్వపల్లి
రాజకీయ అనుభవం, పదవులు

- 2019లో కాల్వపల్లి సర్పంచ్‌గా ఎన్నిక
- 2019లో బీఆర్‌ఎస్ జెడ్పీటీసీ అభ్యర్థిగా 326 ఓట్లతో గెలుపొంది జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నిక
- 2023లో జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మృతితో ఇన్‌చార్జ్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు
- ప్రస్తుతం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో..

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : నాగజ్యోతి

ములుగు: సీఎం కేసీఆర్ సోమవారం.. 2023 తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ అభ్యర్థిగా ఇన్‌చార్జ్ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతిని ప్రకటించారు. ఈ నేపథ్యంలో 'సాక్షి'కి ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. 'సీఎం కేసీఆర్ నాపై నమ్మకంతో బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించారు. గెలిచిన తరువాత అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోతూ రాజకీయలకతీతంగా నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా. నాకు ములుగు అసెంబ్లీ టికెట్ కేటాయింపులో సహకరించిన రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ చెప్పినట్లు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం. ఇతర పార్టీలకు డిపాజిట్ కూడా దక్కదు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. ఇప్పటికే కేసీఆర్ ములుగు జిల్లాకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. గెలిచిన తరువాత సీఎంతో మాట్లాడి మరిన్ని అభివృద్ధి పనులు జరిగేలా కృషి చేస్తా. నా గెలుపు కోసం సహకరించే ప్రతి ఒక్కరితో పాటు సామాన్యులకు కూడా అందుబాటులో ఉంటా. ఏ సమస్య వచ్చినా నేనున్నానే విషయం మరిచి పోవద్దు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో నెలకొన్న ప్రతీ సమస్య పరిష్కరిస్తా' అన్నారు.